క్లుప్తంగా

సబ్ జైలు తనిఖీ



సబ్ జైలును పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి బండి సుభాన్

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం సబ్ జైలును స్థానిక జూనియర్ సివిల్ జడ్జి బండి సుభాన్ తనిఖీ చేశారు. మంగళవారం న్యాయవాదులతో కలిసి జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు జైలులో అందుతున్న సౌకర్యాలు, భోజన వసతి, మరుగుదొడ్ల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. జైలు నుంచి బయటకు వెళ్లగానే శాంతియుత జీవనం గడపాలని జడ్జి సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు దాదా ఖలందర్, తిమ్మప్ప, రామాంజనేయులు, జైలర్ ధనుంజయనాయుడుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ భూములు వేలం వేయరాదని నిరసన



నిరసన తెలుపుతున్న పొట్టిపాడు గ్రామస్తులు

ఉరవకొండ: వజ్రకరూరు మండలం పొట్టిపాడులోని దేవదాయ శాఖకు చెందిన భూములను వేలం వేయరాదని దళిత రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం ఉరవకొండ పట్టణంలోని కెనరా బ్యాంకు ఎదుట ఉన్న గ్రూప్ టెంపుల్స్ ఈఓ కార్యాలయం ఎదుట దళిత, గిరిజనుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో దళిత రైతులు నిరసన తెలిపారు. సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మీనుగ గోపాల్ మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి పొట్టిపాడుకు చెందిన కాశీవిశ్వేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, సుంకలమ్మ, ఈశ్వరస్వామి ఆలయాలకు ఏటా గుత్త చెల్లిస్తున్నట్లు తెలిపారు. అధికారులు ఆలయ భూములు వేలం వేయకుండా పాత వారికే భూములు సాగుచేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అనంతరం రైతులు ఆలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రైతులు శంకర, సుల్తాన్, కుళ్లాయప్ప ,సుంకన్న, శ్రీనివాసులు, తిప్పన్న, రామకృష్ణ, ఈరన్న పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఉరవకొండ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్ మమత అన్నారు. మంగళవారం స్థానిక బాలికల కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కళాశాల అధ్యాపకులతో కలిసి విద్యార్థి, విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి, హమీదా, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శివప్రసాద్, ఖాదర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని నిరసన



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పట్టణ ప్రజలు

ఉరవకొండ: పట్టణంలో నాలుగు నెలలుగా తీవ్ర రూపం దాల్చిన తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పట్టణవాసులు స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. స్థానిక ఇంద్రానగర్, పాతపేట, గాంధీచౌక్ కాలనీలకు చెందిన మహిళలు, కాలనీవాసులు పెద్ద ఎత్తున ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి చేరుకొని నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం తమకు శాపంగా మారిందన్నారు. నెల రోజులకోసారి కూడా తాగునీరు సరఫరా కాకపోతే ఎలా అని ప్రశ్నించారు. బిందె రూ.10తో కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. కాలనీవాసులు నిరసన తెలియజేస్తుంటే అధికారులు సమాధానం చెప్పలేదు.

బడిఈడు పిల్లలను చేర్పించాలి



మోపిడిలో బడికిపోతా ర్యాలీ చేస్తున్న దృశ్యం


ఉరవకొండ: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చూడాలని ఈఓఆర్డీ చంద్రమౌళి అన్నారు. మంగళవారం మండలంలోని మోపిడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నిర్వహించిన బడికి పోతా ర్యాలీని ఈఓఆర్డీ ప్రారంభించారు. ఈఓఆర్డీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యదర్శి రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఆటపాటలతో విద్య

కూడేరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. మంగళవారం 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా కూడేరులోని అంగన్‌వాడీ కేంద్రం–3 పరిధిలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త కళావతి పిల్లలతో కలిసి ర్యాలీ చేశారు.

వ్యాయామం.. జీవితం ఆనందమయం

- ఉదయం పూట నడకతో ఊబకాయం దూరం
- భయపెడుతున్న బీపీ, చక్కెర వ్యాధులు
- బరువు తగ్గకపోతే ముప్పుతప్పదు



కాలానికి అనుగుణంగా ప్రజల జీవనశైలి మారిపోయింది. ఆహారపు అలవాట్లలోనూ పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇదే రీతిలో ఆరోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో యోగా, వ్యాయామాలు ఆరోగ్యానికి అవసరమవుతున్నాయి. ఇందులో నడక సాధన అత్యంత కీలకమైంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఉపయుక్తమైంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పట్టణంలోని క్రీడా మైదానాలు, పార్కుల్లోని జిమ్ యంత్రాలు, కణేకల్లు, బళ్లారి, బీటీపీ, అనంతపురం, భంభం స్వామి రహదారుల్లో వాకింగ్‌కు వెళ్లే వారి సంఖ్య క్రమంగా పెరిగింది. రోజూ నడవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వైద్య నిపుణులు చెప్పున్నారు. – రాయదుర్గం:



నడకతో అనేక లాభాలు..

రోజూ వ్యాయామాలతో పాటు నడక సాధన చేయడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని క్రీడా, వైద్య నిపుణులు చెప్తున్నారు. శరీర సౌష్టవాన్ని కాపాడుకోవడంతో పాటు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందొచ్చు. సూర్యరశ్మి శరీరంపై పడటం వల్ల డీ–విటమిన్ లోపాన్ని అధిగమించొచ్చు. ఎముకలు గట్టిపడటానికి దోహదపడుతుంది. ఉద్యోగ, ఉపాధి పనుల్లో రోజంతా ఉత్సాహంగానూ ఉంటారు. ఆహారపు అలవాట్లను కూడా మార్చుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో కనీసం గంటపాటు వాకింగ్ చేస్తే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని, జీవితకాలం కూడా పెంచుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. పెద్దలు కూడా పిల్లలకు చిన్ననాటి నుంచే వ్యాయామం, వాకింగ్‌పై ప్రోత్సాహించాల్సిన ఆవశ్యకత ఉంది.

మైదానాలు, రహదారుల్లో సాధన..

పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంతో పాటు పట్టణ శివారుల్లో ఏర్పాటైన పార్కులు, భంభంస్వామి ఆలయం వద్ద బయలు ప్రదేశం, బళ్లారి రోడ్డులోని ట్యాంకు, మల్లాపురం దారి, అనంతపురం ప్రధాన మార్గంలోని మద్దానేశ్వర ఆలయం ప్రాంగణం, డిగ్రీ కళాశాల మైదానం ఇలా అనేక ప్రాంతాల్లో వాకింగ్, వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. కొందరు ప్రతి ఆదివారం వేకువజామున 5 గంటలకే రామాలయం వైపు కొండమీదకు నడిచి వెళ్లి వస్తున్నారు.

ద్రవ పదార్థాలు తీసుకోవడం అవసరం..

ఎంతటి భోజన ప్రియులైనా కాస్త మోతాదు తగ్గించి ఆహారం తీసుకోవాలి. ఘన పదార్థాల కంటే ద్రవ పదార్థాలే ఎక్కువ తీసుకోవాలి. ఆకలి తక్కువగా ఉంటుంది. 15 నుంచి 20 నిమిషాల కోసారి నీరు తాగాలి. రోజుకు నాలుగు నుంచి ఐదు లీటర్ల వరకు నీరు తీసుకుంటే బరువు తగ్గేందుకు అవకాశం ఉంటుంది.

రెగ్యులర్‌గా వాకింగ్ చేయాలి



ప్రతి ఒక్కరూ రెగ్యులర్‌గా వాకింగ్‌చేస్తే ఆరోగ్యానికి చాలా మంచిది. శరీర బరువుతో పాటు కొలెస్ట్రాలు, బీపీ, షుగర్, ఇతర వ్యాధులు అదుపులో ఉంటాయి. గుండెపోటుకు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కాలినడక చాలా అవసరం. ప్రతి రోజూ ఉదయం గంటపాటు వాకింగ్ చేయడం ఉత్తమం.

– డాక్టర్ మాధవి, సూపరింటెండెంట్, రాయదుర్గం ఏరియా ఆస్పత్రి

ఆహార నియమాలు పాటించాలి



ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటించాలి. వేపుళ్లు, నూనె ఎక్కువగా ఉండే పదార్థాలు తీసుకోవడం మంచిది కాదు. నీరు శాతం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడం మంచిది. వాకింగ్, వ్యాయామం చేసేటప్పుడు నీరసం రాకుండా జాగ్రత్త వహించాలి. అతిగా వ్యాయామం చేయడం మంచిదికాదు. ఎండలో కూడా ఎక్కువగా వాకింగ్ చేయరాదు.

– రమేష్, పీహెచ్‌సీ వైద్యాధికారి, గుమ్మఘట్ట

'ముసుగులు తొలగించారు'

కూడేరు: కూడేరులోని తహసీల్దార్ కార్యాలయం ముందు, మండలంలో పలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల వద్ద ఉన్న శిలాఫలకాలకు కప్పిన ముసుగులను అధికారులు తొలగింపజేశారు. 'కోడ్ ముగిసినా తొలగని ముసుగు' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు.

నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

వజ్రకరూరు: కార్డుదారులకు రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ మహమ్మద్ రఫి సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ సరుకుల పంపిణీపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మహమ్మద్ రఫి మాట్లాడుతూ చౌకధాన్యపు డిపోల నుంచి ఎండీయూ వాహనాల ద్వారా అందిస్తున్న రేషన్ సరుకులను సక్రమంగా కార్డుదారులకు అందించాలని, రేషన్ సరుకులను నిర్దీత గడువు తేదీ వరకు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరులో చిరు జల్లులు

వజ్రకరూరు: మండల కేంద్రంలో మంగళవారం చిరు జల్లులు కురిశాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పంటలు సాగుచేసే పనిలో నిమగ్నమయ్యారు. భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందని రైతులు చెప్తున్నారు.

తగ్గిన పచ్చిమిర్చి, టమాట ధరలు

కూడేరు: నాలుగు రోజులు క్రితం వరకు కొండెక్కిన పచ్చి మిర్చి,టమాట ధరలు తగ్గు ముఖం పడుతూ వస్తున్నాయి. మార్కెట్లో వారం క్రితం పచ్చి మిర్చి కేజీ రూ.80–100 వరకు పలికింది. టమాట కేజీ కాయ నాణ్యత బట్టి రూ.70–100 వరకు పలికింది. రెండు రోజులుగా మార్కెట్లో కేజీ టమాట రూ.50కు, పచ్చి మిర్చి రూ.50 నుంచి రూ.60కు తగ్గాయి.

వెంకటాంపల్లి చిన్నతండాలో చెట్టుదేవర

వజ్రకరూరు: మండలంలోని వెంకటాంపల్లి చిన్నతండాలో మంగళవారం సాయంత్రం చెట్టు దేవర నిర్వహించారు. ఈఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు పండాలని కోరుతూ గ్రామంలోని సీతల భవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, మహిళలు ఇళ్లలో నుంచి ప్రత్యేక ప్రసాదాలు తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో పాటలు పాడారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ మంచివర్షాలు కురిసి పంటలు బాగాపండాలని కోరుతూ చెట్టుదేవర నిర్వహించినట్లు తెలిపారు.



వెంకటాంపల్లిచిన్న తండాలో సీతల భవాని అమ్మవారికి పూజలు నిర్వహించిన దృశ్యం

యూటీ పనుల పరిశీలన



గండిపూడ్చివేత పనులను పరిశీలిస్తున్న హెచ్చెల్సీ ఈఈ, డీఈఈలు

కణేకల్లు: కణేకల్లు హెచ్చెల్సీ సబ్‌డివిజన్ పరిధిలో 119/638 కిలోమీటర్ వద్ద యూటీ (అండర్ టన్నెల్) మరమ్మతు పనులను హెచ్చెల్సీ ఈఈ వెంకటరమణరెడ్డి, డీఈఈ మద్దిలేటి మంగళవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంకలో వరదనీటి ఉధృతి పెరిగి యూటీస్లాబ్ పూర్తిగా దెబ్బతినింది. యూటీ మరమ్మతుల కోసం రూ.30 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ పనులు ప్రారంభం కావడంతో కణేకల్లు హెచ్చెల్సీ సబ్‌డివిజన్ డీఈఈ మద్దిలేటి, ఏఈఈ అల్తాఫ్‌లతో కలిసి ఈఈ పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఈఈ అధికారులకు ఆదేశించారు. అనంతరం 112/100 కిలోమీటరు వద్ద కొనసాగుతున్న హెచ్చెల్సీ కాలువ గండిపూడ్చివేత పనులను కూడా ఈఈ పరిశీలించారు.

పశు సంపద అభివృద్ధే లక్ష్యం

బెళుగుప్ప: పశు సంపద అభివృద్ధే రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం లక్ష్యం అని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం మండల పరిదిలోని గంగవరం గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ జి. వెంకటేశులు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి సుధాకర్, కళ్యాణదుర్గం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు శ్రీనివాసగుప్తా తదితరులతో కలిసి ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. 88 పశువులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో బెళుగుప్ప పశువైద్య అధికారి రమేష్, నిపుణులు మంజునాథ్ ,హరిణి, పశువైద్య అసిస్టెంట్‌లు అశోక్, ఎర్రిస్వామి, అనిల్, రవికుమార్, మారుతి, వంశీ, చంద్ర, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

బ్రహ్మసముద్రం : మండలంలోని వేపులపర్తి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ దాసానాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో ఉద్యోగుల హాజరు శాతం, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు.

అధైర్య పడొద్దు...అండగా ఉంటాం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: అధైర్య పడొద్దు...అండగా ఉంటామని పార్టీ శ్రేణులకు మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య చెప్పారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం (సరోజా కాంపౌండ్)లో కుందుర్పి మండలం జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులతో కలిసి సమీక్ష నిర్వహించారు. టీడీపీ నాయకుల బెదిరింపులకు, దాడులకు భయపడకూడదన్నారు. స్థానిక సంస్థల ప్రతినిధులుగా ఎక్కువ శాతం వైఎస్సార్‌సీపీకి చెందిన వారే ఉన్నామన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. పోలీసు స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఏ చిన్న అవసరం ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, జెడ్పీటీసీ రాధాస్వామి, జేసీఎస్ కన్వీనర్ రాము, నాయకులు నాగరాజు, రాజగోపాల్, సర్పంచులు హతావుల్లా, రామ్మూర్తి, ప్రభాకర్, జగన్, విజయ్‌కుమార్, మహిళా నాయకురాలు నాగలక్ష్మి, కౌన్సిలర్ అర్చన, నాయకులు జోసెఫ్ కిశోర్, ఎల్‌ఐసీ మురళి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కంబదూరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ముఖ్యమంత్రి కాలేదని మనోవేదనకు గురై మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ షఫీ కుటుంబాన్ని, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వలంటీర్ తిమ్మరాజు, పాముకాటుతో మృతి చెందిన రామాంజి కుటుంబాలను మాజీ ఎంపీ తలారి రంగయ్య పరామర్శించారు. మంగళవారం ఆయన మండలంలోని అచ్చంపల్లిలోని బాధిత కుటుంబాలకు ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, మండల కన్వీనర్ బాలరాజు, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, నాయకులు డాక్టర్ బొమ్మయ్య, సర్పంచ్ అమర్ ఫయాజ్, దాదు, రాజు, కుర్లపల్లి గంగాధర్, ఎంపీటీసీ సభ్యులు నాగేంద్ర, నాగరాజు ఉన్నారు.



షఫీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

వజ్రకరూరు: రైతులకు ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం అందించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్రకార్యదర్శి కాకర్ల నాగేశ్వరరావు కోరారు. మంగళవారం వజ్రకరూరులో వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల మండల వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారన్నారు. పంటల సాగుకు రైతుల వద్ద పెట్టుబడి కూడా డబ్బులు లేవన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు పెట్టుబడి సాయం కింద రైతులకు రూ.20 వేలు ప్రకటించిందని, వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు.

కామ్రేడ్ తిమ్మప్ప ఆశయాలు కొనసాగిద్దాం

కంబదూరు: పేదల పక్షాన పోరాటాలు చేసిన కామ్రేడ్ తిమ్మప్ప ఆశయాలకు కొనసాగిద్దామని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తిరుపాల్ అన్నారు. మంగళవారం కామ్రేడ్ తిమ్మప్ప 10వ వర్ధంతి వేడుకలు తిప్పేపల్లిలో నిర్వహించారు. సీపీఐ నాయకులు మురళీకృష్ణ, ఆగులూరప్ప, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి

ఉరవకొండ: మండలంలోని పెద్ద కొకుంట్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దారెడ్డి (75) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. సిద్దారెడ్డి మృతదేహం వద్ద ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు, పార్టీ యువనేత వై.భీమిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళుల ర్పించిన వారిలో ముష్టూరు ఎర్రిస్వామి, కొకుంట్ల రామాంజనేయులు ఉన్నారు.



సిద్దారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న యువనేత వై.భీమిరెడ్డి

ముగిసిన ఎర్రితాతస్వామి ఆరాధనోత్సవాలు



బెళుగుప్ప: స్థానిక శాంతిధామంలో వెలసిన అవధూత సద్గురు ఎర్రితాత ఆరాధనోత్సవాలు మంగళవారం ముగిశాయి. స్థానిక శాంతిధామం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి బిల్వార్చనలు, మహాభిషేకాలు, మంత్ర పుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్‌ఐ శివ, ఏఎస్‌ఐ రామదాసు, సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించండి

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డీటీడబ్ల్యూ రామాంజినేయులు, ఆర్‌బీ ఎస్‌కే జిల్లా మేనేజర్ రజితరెడ్డి తెలిపారు. మంగళవారం మారంపల్లిలోని ఏపీటీడబ్ల్యూఆర్ ఎస్ హాస్టల్‌లో ఎనీమియా వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రిహాజైనం, వార్డెన్ సి.నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

కుందుర్పి: స్థానిక బండమీదపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులు పంట రుణాలను ఈనెల 30లోపు రెన్యూవల్ చేసుకోవాలని సీఈఓ జాలప్ప మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

డయేరియాపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ బృందం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కిశోర్, మెడికల్ ఆఫీసర్ అజహర్‌ఖాన్

రాయదుర్గటౌన్: సీజనల్ వ్యాధులు, డయేరియాపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఏఎన్‌ఎంలు, శానిటరీ సెక్రటరీలపై ఉంటుందని మున్సిపల్ కమిషనర్ కిశోర్, అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ అజహర్‌ఖాన్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని కమిషనర్ చాంబర్‌లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్, సచివాలయ హెల్త్ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు, అతిసారకు ప్రజలు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

గుమ్మఘట్ట: డయేరియాపై నిర్లక్ష్యం చేస్తే ముప్పు తప్పదని పీహెచ్‌సీ వైద్యులు బాలాజీనాయక్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డయేరియాతో ప్రాణ నష్టం జరగకుండా కాపాడాలని సూచించారు. ఇంటింటా సర్వే చేసి డయేరియాపై ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీధర్, సూపర్‌వైజర్లు ఆదిబయమ్మ, జయమ్మ తదితరులుపాల్గొన్నారు.

సెట్టూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో డయేరియా కిట్లను పంపిణీ చేయాలని డాక్టర్ తరుణసాయి సూచించారు. మంగళవారం ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 31 వరకు డయేరియా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలన్నారు. పీహెచ్‌ఎన్ సరోజమ్మ, సూపర్‌వైజర్ లీలావతి, శోభాలత తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: కలుషిత నీటితోనే అతిసార వ్యాధి వ్యాప్తి చెందుతుందని మండల వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి తెలిపారు. మంగళవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే నిర్వహించారు. అతిసార, మలేరియా, డెంగీ వ్యాధులపై వారికి వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రవీంద్ర, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సెట్టూరు: గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని డాక్టర్ వేణుకార్తీకేయ మలేరియా సబ్‌యూనిట్ అధికారి తిరుపాలయ్య సూచించారు. మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బంది సరోజమ్మ, లీలావతి, శోభాలత, ఏఎన్‌ఎం భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

డయేరియాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

కళ్యాణదుర్గం: డయేరియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సాలమాన్, సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెల్త్, సచివాలయం, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యాశాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఈఓఆర్డీ బాలాజీ, ఏపీఎం రామ్మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తిరుపాల్ నాయక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో స్టాప్ డయేరియా, ఉధృత అతిసార నియంత్రణ మాసోత్సవాలపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ అతిసార వల్ల ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, సూపర్ వైజర్లు నాగశంకర్ ,సుశీల, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : డయేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ అన్నారు మంగళవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ హేరీ, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటితోనే డయేరియా

- ఉరవకొండలో జిల్లా ఎపిడమిక్ బృందం పర్యటన

ఉరవకొండ: కలుషిత నీరు తాగడం వల్లే డయేరియా వ్యాప్తి చెందిందని, ప్రజలు కలుషిత నీరు తాగకుండా జాగ్రత్త పడాలని, గుర్తింపు లేని మినరల్ వాటర్‌ప్లాంట్ల నుంచి నీరు తీసుకొచ్చి తాగరాదని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సుజాత అన్నారు. మంగళవారం ఉరవకొండలో జిల్లా ఎపిడమిక్ బృందం పర్యటించింది. పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో నమోదవుతున్న డయేరియా కేసులపై ఈనెల 25న 'సాక్షి'లో 'విజృంభిస్తున్న డయేరియా' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిని జిల్లా ఎపిడిమిక్ బృందం పరిశీలించింది. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత, డీపీఎంఓ రవిశంకర్, డాక్టర్ వేమారెడ్డి బృందం ఉరవకొండ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎల్లోజి, డాక్టర్ సాహితితో కలిసి డయేరియాతో ఆస్పత్రి పాలైన వారితో మాట్లాడారు. ఎంతమంది డయేరియాతో ఆస్పత్రిలో చేరారో ఓపీ రిజిష్టర్ పరిశీలించారు. అనంతరం ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారులతో ఎపిడిమిక్ బృందం సమావేశమై, డయేరియా కేసులపై చర్చించింది.